జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం 10-10-2025 | పేజీలు:6




# సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టితో మంత్రి తుమ్మల సమావేశం

- సీతారామ ప్రాజెక్టు పనుల వేగవంతానికి చర్యలు
- మంత్రి తుమ్మల వెల్లడి
- ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనులు పై కీలక చర్చ
- తుమ్మల ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 9, ప్రజా జ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరుగుతున్న ప్రధాన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పెండింగ్ పనుల పరిష్కారం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గురువారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి దిశానిర్దేశకంగా నిలిచింది. ఖమ్మం జిల్లా అభివృద్ధి బాటలకు మంత్రి తుమ్మల సూచించిన అన్ని ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నేషనల్ హైవే పనుల పురోగతి, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపన, భద్రాచలం కరకట్ట విస్తరణ పనుల, పలు గ్రామీణ రహదారులు, నీటిపారుదల, విద్యుత్ , భూసేకరణ సంబంధిత అంశాలు పై చర్చించారు, అభివృద్ధి ఎజెండాగా సాగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూ సేకరణ అంశం ప్రధాన చర్చగా నిలిచింది, మంత్రి తుమ్మల ఈ అంశాలపై పూర్తి వివరాలు అందించి, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టేలా సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ప్రాజెక్టు పరిధిలో రైతుల భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలను

4లో




# హైకోర్టు స్టేతో ఎన్నికల హడావుడికి బ్రేక్

## 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై చట్టబద్ధ అడ్డంకి

2లో

## అక్షర సత్యమైన ప్రజాజ్యోతి అంచనాలు..

- చట్టం -రాజకీయాల మధ్య చిక్కుకున్న ప్రభుత్వం
- స్టే తీర్పుతో రాష్ట్ర రాజకీయల్లో పెరిగిన వేడి!
- మళ్లీ తెలంగాణలో చెలరేగిన రిజర్వేషన్ చర్చ..
- ప్రజాజ్యోతి హెచ్చరికకు హైకోర్టు ముద్ర

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి బీసీ రిజర్వేషన్ అంశం చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై గురువారం హైకోర్టు స్టే విధించడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అశ్వారావుపేట, అక్టోబర్ 09, (ప్రజాజ్యోతి)







# బస్ భవన్‌కు వెళ్లొద్దు..


- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు
- తెల్లవారుజాము నుంచే అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసిన పోలీసులు
- బస్సు చార్జీలు తగ్గించే వరకూ పోరాడుతాం: బీఆర్ఎస్ శ్రేణుల స్పష్టీకరణ

కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'చలో బస్ భవన్' కార్యక్రమానికి గురువారం పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్ భవన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్తుండగా పోలీసులు తెల్లవారుజాము నుంచే ఎక్కడికక్కడ అడ్డుకొని ముందస్తు అరెస్టులు చేశారు. వారిని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు అంటూ ఊకదంపుడు మాటలు మాట్లాడుతున్న ప్రభుత్వం.. సామాన్యులపై భారం మోపే విధంగా చార్జీలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. చార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

5లో



# హైకోర్టు స్టేతో ఎన్నికల హడావుడికి బ్రేక్




చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, న్యాయమూర్తి మొహియుద్దీన్ బెంచ్ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వం రెండు వారాల్లో సమగ్ర నివేదికను సమర్పించాల్సి ఉంది. బీసీ వర్గాల ప్రతినిధ్యం పెంచుతూ సామాజిక న్యాయం సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ఈ సమయంలో, హైకోర్టు ఇచ్చిన తాజా స్టే ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను కూడా నిలిపేశాయి. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుందనే ఆశల మధ్య వచ్చిన ఈ తీర్పు ఇప్పుడు ప్రభుత్వం ముందు కొత్త సవాళ్లను తెచ్చింది. దాంతో ఒకవైపు ఎన్నికల హడావుడి, మరోవైపు న్యాయ పరిమితులు.. ఈ రెండింటి మధ్య రాష్ట్ర పాలక వర్గం చిక్కుకుపోయినట్టయింది. అయితే బీసీ రిజర్వేషన్లపై ప్రజాజ్యోతి ముందే చెప్పిన విశ్లేషణలు నిజం అయ్యాయి. దీంతో నిన్నటి హైకోర్టు తీర్పు వాటికి మరోసారి ముద్ర వేసినట్టయింది.

**నిలిచిన ఎన్నికల ప్రక్రియ..**

జీవో నెంబర్ 9 ద్వారా బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నేలె 9 నుండి మొదలయ్యింది. జిల్లాల వారీగా ఎన్నికల ప్రక్రియ మొదలయ్యి, కొందరు నామినేషన్ లు కూడా వేశారు. అయితే ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ కొందరు పిటిషనర్లు ముందే హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ కేటాయింపులో చట్టబద్ధమైన నిబంధనలు, గణాంక ఆధారాలు పాటించలేదని వాదిస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, మొహియుద్దిన్ బెంచ్ పిటిషన్లను పరిశీలించి జీవో నెంబర్ 9 అమలుపై తాత్కాలిక స్టే విధించింది. నాలుగు వారాల్లో ఈ అంశం పై ప్రభుత్వం సమగ్ర కౌంటర్ సమర్పించాలని ఆదేశించింది. దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇంత పెద్ద స్థాయి స్టే రావడం చాలా అరుదైన విషయం. దీంతో అధికార యంత్రాంగం సైతం అయోమయంలో పడింది. జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. కానీ హైకోర్టు ఆదేశాలతో ఎన్నికల ప్రక్రియను నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికారులు, అభ్యర్థులు, రాజకీయ నాయకులు అందరూ కొత్త సూచనల కోసం ఎదురు చూస్తున్నారు.

**ప్రభుత్వం ముందున్న దారులు..**

ఇప్పుడు హైకోర్టు స్టే తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మూడు మార్గాల సడలింపులో ఉంది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేసి, స్టే ఎత్తివేయించుకునే ప్రయత్నం చేయడం. కానీ గతంలో మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ విషయంలో సుప్రీంకోర్టు 50 శాతం పరిమితిని మించకూడదని స్పష్టం చేసింది. అదే మార్గం ఇక్కడ కూడా అవరోధంగా మారే ప్రమాదం ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు నాలుగు వారాల్లో సమగ్ర కౌంటర్ సమర్పించి, బీసీ రిజర్వేషన్ అవసరాన్ని చట్టపరంగా సమర్థించుకోవడం. కానీ ఇది కూడా సులభమైన విషయం కాదు. జనాభా లెక్కలు, సామాజిక ప్రతినిధ్య గణాంకాలు, ప్రత్యేక కమిషన్ నివేదికలు ఇవన్నీ నిర్ధారణ కావాలి. దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. రాజకీయ దృష్ట్యా బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ప్రజా వేదికల మీద స్పష్టంగా చెప్పి, కోర్టు అనుమతి వచ్చేవరకు ఎన్నికల ప్రక్రియను ఆపి, ప్రజాభిప్రాయాన్ని సానుకూలంగా మలచుకోవడం. ఇది కాంగ్రెస్ పార్టీకి సామాజిక న్యాయ దిశగా రాజకీయ బలాన్ని తెచ్చిపెట్టే అవకాశం కూడా బలంగా ఉంది.

**తదుపరి పరిణామాలపై ఉత్కంఠ**

రాష్ట్ర ఎన్నికల సంఘం, సీఈఓ కార్యాలయం తదుపరి నిర్ణయాల కోసం హైకోర్టు ఆదేశాల కాపీని పరిశీలిస్తోంది. ఈ వారంలో ప్రభుత్వం సుప్రీంకోర్టు మార్గాన్ని ఎంచుకునే అవకాశాలు ఉన్నాయని సమాచారం. మరోవైపు, కొంతమంది బీసీ సంఘాలు "స్టే ఎత్తివేయాలి" అంటూ పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేపట్టే ప్రయత్నంలో ఉన్నాయి. ప్రజా వేదికలపై 'సామాజిక న్యాయం నిలిచిపోవద్దు' అనే నినాదం మళ్లీ వినిపిస్తోంది. దీంతో బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణలో ఇప్పుడు చట్టం, రాజకీయాలు, ప్రజాభిప్రాయం ఈ మూడింటి కూడలి వద్ద నిలిచిపోయింది. న్యాయస్థానాల తీర్పు, ప్రభుత్వ పట్టుదల, ప్రజల ఆవశ్యకత ఈ త్రిముఖ దిశల్లో ఏది పైచేయి సాధిస్తుందో, ఎవరి భవిష్యత్తును ఎలా నిర్ణయిస్తుందో వేచి చూడాలి మరి.

## అక్షర సత్యమైన ప్రజా జ్యోతి కథనాలు

**అయితే బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అంశం పై గత వారం రోజులుగా "ప్రజా జ్యోతి" దినపత్రికలో ప్రచురితమైన విశ్లేషణాత్మక కథనాలు అక్షర సత్యమైపోయాయి. ప్రభుత్వ నిర్ణయాల చట్టబద్ధత, రిజర్వేషన్ల శాతం పెంపుపై న్యాయపరమైన ప్రతిబంధకాలు తలెత్తవచ్చని ప్రజాజ్యోతి ముందుగానే హెచ్చరించింది. "రిజర్వేషన్ చట్టం కోర్టు అడ్డంకిని దాటుతుందా?", "మహారాష్ట్ర మాదిరిగా కొత్త జటిలతా?" వంటి ప్రశ్నలతో ప్రజాభిప్రాయాన్ని మేల్కొలిపింది. ఇప్పుడు హైకోర్టు తీర్పుతో ప్రజా జ్యోతి అంచనాలు నిజమయ్యాయి. ఈ నేఫధ్యంలో ఇతర పత్రికలు ఎన్నికల వాతావరణం, అభ్యర్థుల జాబితాలు, రాజకీయ పాకలు గురించి రాసిన వేళ.. ప్రజా జ్యోతి మాత్రం బీసీ రిజర్వేషన్ చట్టబద్ధతపై న్యాయపరమైన పరిణామాలను ప్రజల ముందుంచింది. కోర్టుల తీర్పులు, రాజ్యాంగ పరిమితులు, మాండల్ కమిషన్ నిర్ణయాలు వంటి అంశాలను స్పష్టంగా వివరించి, ఎన్నికల ప్రక్రియలో చట్టపరమైన అడ్డంకులు తలెత్తే అవకాశం ఉందని సూచించింది. ఈ సత్యాన్ని ఇప్పుడు హైకోర్టు తీర్పే ధృవీకరించింది. ప్రజలలో విశ్లేషణాత్మకమైన చైతన్యం కలిగించినందుకు ప్రజా జ్యోతి పత్రికపై మేధావులు, విశ్లేషకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.**

# సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టితో మంత్రి తుమ్మల సమావేశం

మంత్రి తుమ్మల వివరంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భూ సేకరణ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మంత్రి తుమ్మల సీఎంను కోరగా తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలు కాపాడుతూ, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా స్పష్టమైన దిశానిర్ధేశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం%-%భద్రాద్రి జిల్లాల్లో సాగునీరు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, వ్యవసాయ రంగం బలపడడం, రైతుల ఆదాయాలు పెరగడం వంటి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రానికి ఆర్థిక, సామాజికంగా సీతారామ ప్రాజెక్టు కీలక మలుపుగా నిలవనుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఖమ్మం - దేవరపల్లి, అమరావతి - నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేల భూసేకరణకు అడ్డంకులు తొలగించాలని రెవిన్యూ యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. ఈ నూతన హైవేల ఇరువైపులా ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్ ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులపై సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు, అవసరమైతే ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించి సీతారామ ప్రాజెక్టు కెనాల్ పనులను శరే వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగూడెం ఎర్త్ సైన్స్ స్ యూనివర్సిటీ నూతన భవనాల నిర్మాణానికి రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు మంత్రి తెలిపారు. మొదటి సరిగా ప్రారంబిస్తున్న మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ స్ యూనివర్సిటీ తరగతులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు మంత్రి తుమ్మల ఆహ్వానించగా, ఎన్నికల కోడ్ ముగియగానే తగు సమయం చూసుకొని వస్తానని తెలిపారు. భద్రాచలం కరకట్ట విస్తరణ పనుల గురించి ముఖ్యమంత్రి , ఉపముఖ్యమంత్రి కి వివరించి భద్రాచలం పట్టణాన్ని శాశ్వతంగా గోదావరి వరద నుండి విముక్తి చేయడానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి తుమ్మల చేసిన ప్రతిపాదనలపై సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం అవసరమైన నిధులు మంజూరు చూస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.






# వ్యసనాలకు బానిసకావొద్దు

**యువత భవిష్యత్తుపై దృష్టి పెట్టండి**

**సిగరెట్, పాన్ మసాలా,గుట్క లపై విద్యార్థులకు అవగాహన కల్పించిన.... జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయలక్ష్మి**

**టేకులపల్లి,అక్టోబర్09,ప్రజాజ్యోతి:** యువత వ్యసనాలకు బానిస కాకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయలక్ష్మి అన్నారు. మండలంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో గురువారం టొబాకో ఫ్రీ డే సందర్భంగా విద్యార్థులకు సిగరెట్,పాన్ మసాలా,గుట్కలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయలక్ష్మి అవగాహన



కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తంబాకు గుట్కా పొగాకు చుట్ట బీడీ అలవాటు పడకూడదని పిల్లలకు తెలిపారు.పొగాకు వలన జరిగే ఆరోగ్యహానికరం గురించి నష్టాల గురించి,భవిష్యత్తులో ఎదురుకునే సమస్యల గురించి ఆమె వివరించారు.పొగాకు తినడం వలన క్యాన్సర్ జబ్బులు వస్తాయని హెచ్చరించారు.పొగాకు బహిరంగ ప్రదేశాలలో పొగ పీల్చడం ,తినడం చేయరాదని తెలిపారు.సిగరెట్లు, సుట్ట,బీడి తాగే వారి దగ్గర నిల్చున్న వారికి కూడా హాని జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి డి పి ఓ డాక్టర్ మధు వరుణ్, డాక్టర్ దినేష్, సి హెచ్ ఓ.పార్వతి, పి హెచ్ఎన్ చంద్రకళ, హెచ్ ఈ ఓ దేవా, రాంప్రసాద్, హెచ్ ఎస్ లు వెంకటేశ్వర్లు ,కౌసల్య,విజయ ఏఎన్ఎం చంద్రకళ, ఆశాలు లక్ష్మి,పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్ లో బీఆర్ఎస్ నాయకులు

**భద్రాచలం బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు**

**భద్రాచలం, అక్టోబరు 9,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని బీఆర్ఎస్ నాయకులను గురువారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఆర్టీసీ టికెట్ల రేట్ల పెంపుపై హైదరాబాద్ బస్ భవన్ ముట్టడి కార్యక్రమంకు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు వాపోతున్నారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, కొల్లం జయప్రేమ్కుమార్, అయినాల రామకృష్ణలు ఉన్నారు.




# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి - రాజ్యాంగంపై దాడి:

## ఎమ్మార్పీఎస్ స్టేట్ సెక్రటరీ కొలిక పోగు కాంతారావు మాదిగ

**అక్టోబర్ 9 నుంచి 19 వరకు పది రోజులపాటు దేశవ్యాప్తంగా నిరసన ఉద్యమ కార్యాచరణ**

**దమ్మపేట, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడిని తెలంగాణ ఎమ్మార్పీఎస్ స్టేట్ సెక్రటరీ కొలిక పోగు కాంతారావు మాదిగ తీవ్రంగా ఖండించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండలం, పట్వారిగూడెం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ,"రాజ్యాంగ విలువలతో న్యాయవాదిగా ఎదిగి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే అత్యున్నత న్యాయమూర్తిని అవమానించడం సిగ్గుచేటు, క్షమించరాని నేరం" అని అన్నారు. సనాతన హిందూ ధర్మం పేరుతో ఒక మతోన్మాది అడ్వకేట్ సుప్రీంకోర్టు ప్రాంగణంలోనే సిజెఐ గవాయ్పై పాదరక్ష విసరడం అత్యంత దారుణమని, ఇది వ్యక్తిగత దాడి కాదు,దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పునాదులపై జరిగిన దాడి అని ఆయన అన్నారు.ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించి, దీని వెనక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు."గవాయిపై దాడి అంటే రాజ్యాంగంపైనే దాడి" అని పేర్కొంటూ, దేశ ప్రజాస్వామ్య పునాదులను కాపాడే ప్రతి భారత పౌరుడు దీనిపై స్పందించాలని పిలుపునిచ్చారు.




అలాగే, నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠిన శిక్ష విధించాలని కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో, ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ అక్టోబర్ 9 నుంచి 19 వరకు పది రోజులపాటు దేశవ్యాప్తంగా నిరసన ఉద్యమ కార్యాచరణ నిర్వహించాలని పిలుపునిచ్చిందని తెలిపారు.



# ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారు

**ప్రాజెక్టుల పేరుతో కోపం దోచుకుంటున్నారు**

**పేదల సాగు చేసుకుంటున్నా భూములు లాక్కుంటున్నారు... సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్**

**అశ్వారావుపేట, అక్టోబర్ 09,ప్రజాజ్యోతి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మరొకసారి వస్తున్నాయని గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ కానీ నేడు అధికారం చాలా ఇస్తున్న కాంగ్రెస్ గానీ ప్రజలను మోసం చేయడానికి ఉన్నాయని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మండలంలోని దిబ్బగూడం గ్రామంలో కుంజా అర్జున్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశనికి ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. నాటి ప్రభుత్వం ధరణి పేరుతో భూములు కాల్ చేస్తే నేటి ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో కోట్లు కొల్లగొడుతుందన్నారు. 6 గ్యారంటీలు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క గ్యారెంటీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. పెద గిరిజన, గిరిజనేతురులు సాగుచేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు అడ్డం పెట్టుకొని లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఏ ఒక్క ఎమ్మెల్యే కానీ మంత్రి గానీ పేద రైతుల బాధలపై మాట్లాడట్లేదు అ ఏ ఒక్క ఎమ్మెల్యే కానీ మంత్రి గానీ పేద రైతుల బాధలపై మాట్లాడట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు కంగాల కల్లయ్య మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, మండల నాయకులు బాడిస లక్ష్మణరావు, ధర్మల శ్రీరాములు, కారం మల్లేష్, మాజీ సర్పంచ్ కుంజాలక్ష్మి, పోతురాజు కారం తులసి, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి చదివే విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**భద్రాచలం, అక్టోబరు 9,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని ఎస్సీ హాస్టల్ లో ఉంటూ పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించిన సంఘటన ఇది. ఉదయం హాస్టల్ నుంచి జిల్లాపరిషత్ బాలికల పాఠశాలకు వెళ్లిన బాలిక అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోవడంతో ఉపాధ్యాయులు సమీపంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించడంతో పాటు బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చదువుపై ఆసక్తి లేని కారణంగానే బాలిక ఎదో గుర్తు తెలియని పదార్థం తిన్నట్లు వైద్యులు భావిస్తున్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యంగానే ఉందని, మానసిక స్థితి సరిగా లేనందున బాలికను తల్లిదండ్రులతో ఇంటికి పంపారు. ఇదిలా ఉండగా బాలిక ఆత్మహత్యాయత్నంకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్యు డివిజన్ అధ్యక్షులు మునిగెల శివ ప్రశాంత్ డిమాండ్ చేస్తున్నారు.

# కిష్టారం గ్రామంలో వైద్య శిబిరం

**టేకులపల్లి,అక్టోబర్09,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో గురువారం కిష్టారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటి వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ శైలజ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మగుడి హుండీ లెక్కింపు రూ.41.02 లక్షల ఆదాయం

**108 సువర్ణ పుష్పాలతో అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన.**



**పాల్వంచ(రూరల్),అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** పాల్వంచ మండలంలోని కేశవాపురం%-%జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో భక్తులు సమర్పించిన హుండీలను గురువారం లెక్కించారు. 2025 మే 29 నుండి అక్టోబర్ 8 వరకు 133 రోజుల వ్యవధిలో హుండీల ద్వారా మొత్తం రూ. 41,02,731/- ఆదాయం వచ్చినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. అదనంగా విదేశీ నోట్లు 4, విదేశీ నాణేలు 20,అలాగే బంగారం 120 గ్రాములు,వెండి 2 కిలోలు 600 గ్రాములు కూడా లభించాయి. ఈ హుండీ లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకుడు పి.భేల్సింగ్ పర్యవేక్షించగా,దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్.రజనీకుమారి,ధర్మకర్తల మండలి సభ్యులు,కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ %ఄ% సిబ్బంది,పోలీస్ శాఖ సిబ్బంది, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు మరియు దేవస్థాన సిబ్బంది సహా మొత్తం 150 మంది పాల్గొన్నారు. అదేవిధంగా గురువారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి 108 సువర్ణ పుష్పములతో సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులచే హారతి,మంత్రపుష్పం,నివేదన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించగా,భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీకుమారి,ధర్మకర్తల మండలి సభ్యులు,దేవస్థాన సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

# నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

**చర్ల, అక్టోబర్ 09:(ప్రజా జ్యోతి ):** మనిషి తాను ఎప్పుడూ ఆనందంగా ఉండాలంటే తన మనసు కూడా ఉత్సాహంగా ఉండాలి .కానీ నేటి కాల పరిస్థితులతో మనిషి తన జీవన ప్రయాణం కోసం ఉరుకులు పరుగులు పెడుతున్నాడు. ఉదయం నుంచి రాత్రి వరకు మానసిక ఒత్తిడికి లోనవుతూనే ఉన్నాడు మానసిక ఒత్తిడి విద్యార్థులు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతినిత్యం ఏదో రకంగా మానసిక సంఘర్షణకు లోనవుతున్నారు. మానసిక ఒత్తిడి వలన ప్రశాంతత లేక అధిక ఒత్తిడిని తట్టుకొనలేక కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు మరికొంతమందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతూ ఉన్నాయి. కానీ మన దయనందన జీవితంలో మనము ఒత్తిడిని అంతగా పట్టించుకోము మనిషి ఆరోగ్యకరంగా ఉండాలి అంటే మనసు ప్రశాంతంగా ఉండాలి మానసిక ఆరోగ్యం మంచిగా ఉండాలి అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ సందర్భగా ప్రతి సంవత్సరం అక్టోబర్ పది న ప్రపంచ మాససిక ఆరోగ్య దినోత్సవంను నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం ప్రజలలో




మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కలిపించడం తద్వారా ఒత్తిడిని తగ్గించి ప్రజలలో చైతన్యం పెంపొందించడం ఏపని చెయ్యాలనుకున్న మన మనసు ప్రశాంతంగా ఉండాలి అని చెప్పటం అప్పుడే మన మెదడు చురుగ్గా పనిచేస్తుంది అని మనసును ప్రశాంతంగా ఉంచుకునేదుకు అద్భుతమైన మార్గం ధ్యానం అని ధ్యానం చేయడం ద్వారా మనసు ప్రశాంతంగా మారడమే కాదు రోజంతా మనిషి ఉత్సహంగా ఉంటాడు అని అనేక జాగ్రత్తలను వైద్య నిపుణులు తెలియచేస్తూ ప్రజలకు ఒత్తిడిని జయించే విధానాలను మానసిక ప్రశాంతకు సంబంధించి అవగాహన కల్పిస్తారు .

# ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

**చర్ల, అక్టోబర్ 09 :(ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో గురువారం గురుదేవ విద్యాలయంలో ఇటీవల వెలువడిన నీట్ పరీక్షలో ప్రతిభ కనకనపరిచి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడికల్ సీటు పొందిన పాఠశాల పూర్వ విద్యార్థి పివి ప్రణీత్ అభినందన సభ గురువారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రణీత్ తో పాటు తల్లిదండ్రులు పానుగంటి రామ్మోహన్ - సామ్రాజ్యం దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రణీత్ తల్లిదండ్రులకు పాధాబివందనం చేసారు. ఈ సందర్భంగా ప్రదానోపాద్యాయుడు గిరిప్రసాద్ మాట్లాడుతూ తమ కుమారుడిని వైద్యుడిని చేయాలనే తలంపుతో తల్లిదండ్రులు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువు పై



దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి ప్రణీత్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అకడమిక్ కో ఆర్డినేటర్స్ మల్లాది వెంకట సుబ్రహ్మణ్యం, జి శ్రీనివాస్ లు ప్రణీత్, అతని తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, రామ్మోహన్ బాల్య మిత్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 42% బీసీ రిజర్వేషన్ బోగస్ కాంగ్రెస్ కపట ప్రేమ బట్టబయలు:కాంపెల్లి కనకేష్ పటేల్

**పాల్వంచ(రూరల్ ),అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్ తీవ్రంగా విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన “6 గ్యారంటీలు %-% 420 హామీలు” అన్నీ మోసపూరితమని,ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరిగిపోతున్న నేపథ్యంలో ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల డ్రామా మొదలుపెట్టారని ఆయన అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి,స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తూ,ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి జీవో నెంబర్ 9 ద్వారా రాజ్యాంగ విరుద్ధంగా చర్యలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. హైకోర్టు స్టేతో ప్రభుత్వ మోసపూరిత చర్యలు బట్టబయలయ్యాయని కనకేష్ పటేల్ తెలిపారు. బీసీలపై కాంగ్రెస్‌కు అసలు చిత్తశుద్ధి లేదని ఇది మరోసారి నిరూపితమైందని అన్నారు. తప్పుడు జీవోతో బీసీ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన ప్రభుత్వం ఇప్పటికే 21 నెలలు వృథా చేసిందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి, ప్రతిపక్షాలు,బీసీ సంఘాలతో చర్చించి ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పేరుతో బీసీలకు అన్యాయం చేస్తే బిఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ భూస్థాపితం కాక తప్పదని కాంపెల్లి కనకేష్ పటేల్ తెలిపారు.

# భద్రాచలంలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లు



**భద్రాచలం, అక్టోబరు 9,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో స్థానిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన తొలి రోజున ఏడు ఎంపీటీసీ స్థానాలకు బీఆర్ఎస్ తరపున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఒకటి నుంచి నాల్గొవ వార్డులు, 12, 13, 14 వార్డుల తరపున బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసారు. ఒకటో వార్డు నుంచి పంజా సునీల్, రెండో వార్డు నుంచి తుమ్మలపల్లి సావిత్రి, మూడో వార్డు నుంచి గొల్ల గంగా భవాని, 4వ వార్డు నుంచి కావూరి గోపి, 12వ వార్డు నుంచి తెల్లం కామేశ్వరి, 13వ వార్డు నుంచి ఏనిక శిరీష, 14వ వార్డు నుంచి బూరుగు లావణ్యలు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రబోద్ కుమార్ , ప్రేమ్ కుమార్ తుమ్మలపల్లి ధనేశ్వరరావు , ఆకోజు సునీల్, రేపాక పూర్ణలు పాల్గొన్నారు.



# బస్ భవన్‌కు వెళ్లొద్దు..



అశ్వారావుపేటలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, ఆరేపల్లి గోవింద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చింతకానిలో బీఆర్ఎస్ నాయకులు మంకెన రమేశ్, బొడ్డు వెంకటరామారావు, గురిజాల హన్మంతరావు, మాజీ ఎంపీపీ పోనుగోటి రత్నాకర్, ఓబూరి నరేశ్‌లను అరెస్టు చేశారు. కొణిజర్లలో తనికెళ్ల మాజీ సర్పంచ్ చల్లా మోహన్‌రావు, బోడపోతుల బాబులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. భద్రాచలంలో బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, కొల్లం జయప్రేమ్‌కుమార్, అయినాల రామకృష్ణలను అరెస్టు చేశారు. ఇల్లెందులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్, నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, సిలివేరి సత్యనారాయణ, జేకే శ్రీను, ఎలమందల వాసు, మహ్మద్ జబ్బార్, రాంలాల్ పాసి, లలిత్‌కుమార్ పాసి, దేరంగుల పోశం, గిన్నారపు రాజేశ్, కిషన్ పాసి, వార రమేశ్, రాచపల్లి శ్రీను, సతీశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. లక్ష్మీదేవిపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. మణుగూరులో బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, తురక రాంకోటి, గుర్రం సృజన్, రవిలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గుండాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, అజ్జు, వెంకన్న, గడ్డం వీరన్నలను పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు సురేశ్, సతీశ్, జైదుర్గా ప్రసాద్, ఉపేందర్‌లను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వైరాలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాదినేని ప్రసాద్, ఆదూరి ప్రేమ్‌కుమార్, కారుకొండ బోస్, తోటకూర వీరబాబులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బూర్గంపహాడ్‌లో బీఆర్ఎస్ సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు, లక్ష్మీచైతన్యరెడ్డి, తిరుపతి, ఏసోబు, పంగి సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. పెనుబల్లిలో పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. తల్లాడలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

## మానవత్వం చాటుకున్న ఎఫ్ఆర్ఓ తేజస్విని

**-మృతుని కుటుంబానికి 5000 ఆర్థిక సహాయం**

**పినపాక, అక్టోబర్ 09(ప్రజాజ్యోతి):** కరకగూడెం మండలం తాటి గూడెం గ్రామంలో కొమరం నాగేశ్వరరావు అనే వ్యక్తి అనారోగ్యంతో గత 25 రోజుల నుంచి హాస్పటల్ లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం హైదరాబాదులో మృతి చెందాడు. అతనికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని వారు కూడా చిన్న పిల్లలని తెలుసుకున్న ఈ బయ్యారం అటవీ రేంజ్ ఆఫీసర్ తేజస్వి వారికి తన వంతు ఆర్థిక సహాయంగా 5వేల రూపాయల సహాయం సహాయ అధికారి సాంబశివరావు ద్వారా అందజేశారు. ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు.





## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**విద్యార్థినుల ఆరోగ్యం, ఆహారంపై ప్రత్యేక దృష్టి సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ**

**పినపాక, అక్టోబర్ 9(ప్రజాజ్యోతి):** వాతావరణ మార్పులు, వర్షాల దృష్ట్యా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మినాలి శ్రేష్ఠ ఆదేశించారు. గురువారం పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను అయాన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్‌రూమ్, డార్మెటరీ, డైనింగ్ హాల్ తదితర విభాగాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థినులకు నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం సమయానుకూలంగా పౌష్టిక ఆహారం అందించాలన్నారు. విద్యార్థినులతో మాట్లాడి ఆహారం నాణ్యత గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విషపూరిత క్రిమి కీటకాల ప్రవేశం నివారించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎం మరియు వార్డెన్‌లకు ఆదేశించారు. రాత్రివేళ విద్యార్థినులు డార్మెటరీ వెలుపలికి రాకుండా చూడాలని సూచించారు. చివరిగా, విద్యార్థినుల ఆరోగ్య భద్రతను ప్రాధాన్యంగా తీసుకొని అన్ని మౌలిక సదుపాయాలను సమర్థంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన జడ్పీ సీఈవో, మణుగూరు డిఎస్పి

**పినపాక, అక్టోబర్ 09(ప్రజాజ్యోతి):** పినపాక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల 2025 నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని గురువారం జడ్పీ సీఈవో చంద్రశేఖర్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి సందర్శించారు. అక్కడ పరిస్థితిని ఎంపీడీవో సునీల్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ఎంతటి వారైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

